సులువుగా అప్పు.. జీవితానికి అదే ముప్పు

ఆర్థిక క్రమశిక్షణ అత్యంత కీలకమంటున్న నిపుణులు

విచ్చలవిడిగా యాప్‌ల్లో అర్హతకు తగ్గ రుణాలు.. వ్యక్తుల వద్ద అప్పులు

ఆ సమయంలో కష్టం దాటేసినా.. చివరికి ప్రాణం తీసుకునే పరిస్థితులు

అతడి పేరు నరేశ్. వనస్థలిపురం వాసి. అతడు రెండు సంస్థలకు ఎండీ. అతడు అవసరాల రీత్యా కొందరి నుంచి లక్షల రూపాయల అప్పు జేశాడు. తిరిగి సకాలంలో చెల్లించడంలో విఫలమయ్యాడు. దీంతో అప్పు ఇచ్చినవాళ్లు నరేశ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. చివరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.

అతడి పేరు శ్రీధర్. పెళ్లై 2 ఏండ్లు అయింది. ఉద్యోగమూ ఉంది. జీతం నెలకు రూ.30వేలు. మొదటి ఏడాది భార్యను సొంతూళ్లనే ఉంచాడు. రెండో ఏడాది నగరానికి తీసుకొచ్చి ఇల్లు అద్దె తీసుకున్నాడు. కాగా నెల జీతం అతడి అదనపు అవసరాలకు సరిపడలేదు. ఎలాగూ నెలనెల జీతం వస్తుంది కదా అని కొన్ని యాప్‌లను ఆశ్రయించి అతడి అర్హతకు అనుగుణంగా లోన్ తీసుకున్నాడు. ఏ రోజుకా రోజు అవసరాలను దాటేసాడు. మళ్లీ ఏదైనా ఆర్థిక సమస్య రాగానే మరో యాప్‌ను ఆశ్రయించాడు. ఇలా ఐదారు యాప్‌ల్లో రుణం తీసుకున్నాడు. ఇప్పటి వరకు బాగానే ఉన్నా ఇప్పుడు ఆ మొత్తంపై వడ్డీ చెల్లించడానికి జీతం మీదనే ఆధారపడాలి. ఇప్పుడు అతడు చేసిన నాలుగు లక్షల రుణానికి సుమారు 15 వేలపైనే వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. ఉన్న జీతంలో సగం డబ్బులు రుణానికి పోగా, ఇంటి అద్దెకు, కరెంట్ బిల్లు, పాలబిల్లు, ఇతర ఖర్చులన్నీ ఇప్పుడు భారంగా మారాయి. ఏం చేయాలో అర్థం కాక దంపతుల్లో చిచ్చు మొదలైంది. యాప్ సంస్థలు అతడిని వేధించసాగాయి. దీంతో ఒత్తిడి భరించలేక సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మరణించాడు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఓ కానిస్టేబుల్.. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటం కోసం అప్పులు చేసిండు. తిరిగి అవి చెల్లించలేక ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు.ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలా నగరంలో చాలా మంది ఆర్థికపరమైన ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు తీసుకుంటున్నారు.

- సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) :

సామాన్యుల నుంచి వీఐపీల వరకు.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీవితాలు కూలిపోయాయి. ఉన్నప్పుడు అవలంబించాల్సిన నియమాలు చేజారాక లబోదిబోమంటే ఏం లాభమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉన్నంతలో ఎవరికి వారే ఆర్థిక క్రమ శిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ప్యాకేజీ ఎంతొచ్చినా పొదుపుపై అవగాహన లేకపోతే అంతేసంగతులు. అది లక్షల జీతమైనా.. అమెరికా కొలువైనా పొదుపు మంత్రం పాటించకపోతే జీవితాలు తారుమారవుతాయి. చాలా మంది ఆర్థిక క్రమశిక్షణ లేక జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఓ దశలో ప్రాణాలు కోల్పోవల్సిన ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయి. అందుకే పొదుపు సూత్రాన్ని పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక కష్టాల నుంచి బయటపడే మార్గం సుగమం చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇవి పాటించాలంటున్న నిపుణులు..!!

- ప్రతీ కుటుంబంలో ఒక ఆర్థిక నిధి తప్పనిసరి. అనుకోని కష్టాలు వచ్చినప్పుడు ఆదుకుంటుంది. ఒకే వ్యక్తి పలు పథకాల కింద రుణాలు పొందటం కుటుంబానికి చాలా భారంగా మారే ప్రమాదం ఉంది. ఇటువంటి అన్ని అంశాలపై అవగాహన అవసరం.
- అనేక బ్యాంకులు క్రెడిట్ కార్డుల్ని ఇస్తున్నాయి. అత్యవసరం అనుకుంటేనే వాటిని వినియోగించాలి. అనవసరం ఖర్చులతో అప్పులపాలవ్వొద్దు.
- స్వల్ప సమయానికి భారీగా వడ్డీ ఇస్తామంటూ చాలా సంస్థలు బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తుంటాయి. వాటి వలలో పడొద్దు.
- చిన్న ఉద్యోగులు, మధ్యతరగతి వారు తప్పకుండా ఆరోగ్యబీమా తీసుకోవాలి. పలు సంస్థలు తమ ఉద్యోగులకు నామమాత్రపు మొత్తాలతో ఈ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. ఉద్యోగుల వ్యక్తిగత బీమా సౌకర్యం తప్పనిసరి. రోడ్డుపైన జరిగే ప్రమాదాల్లో ప్రమాదం ఏర్పడితే దానికి బీమా పొందే వీలుంది.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి

-జీసీ కవిత, కౌన్సెలింగ్ సైకాలజిస్టు

వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా తమ ఆదాయ వ్యయాలు ఆర్థిక లావాదేవిల్నీ నిత్యం పర్యవేక్షించుకోవాలి. ఏఏ రంగాల్లో పెట్టుబడుల్ని పెట్టారు? ఎంత మొత్తంలో లబ్ధి చేకూరింది? ఆ పెట్టుబడుల్నీ మళ్లీ దేనిమీద పెట్టడానికి సిద్ధం అవుతున్నారు? నష్టాలొచ్చే రంగంపైపు చూడకుండా లాభాల వైపు స్థిరాస్తుల్ని పెంచుకునే విధంగా సమగ్రమైన ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఏవైనా అనుకోని ఆర్థికపరమైన సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం ప్రయత్నించాలి. ఆత్మహత్యల జోలికి వెళ్లకూడదు. ధైర్యంగా నిలబడి ఎదుర్కోవాలి. చావు దేనికి పరిష్కారం కాదనే విషయం గుర్తుంచుకోవాలి.

దుప్పెల్లిలో ఎండిన పొలంలో దిగి నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ఎండిన పంటకు పరిహారం ఇవ్వాలి

వలిగొండ, మార్చి 7 : మండలంలోని దుప్పెల్లి గ్రామంలో సాగు నీరందక పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని శుక్రవారం బాధిత రైతులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంట పొలాల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి నీళ్లులేక మండలంలో సుమారు 100 ఎకరాల మేర పంటలు ఎండిపోతున్నాయని, అప్పులు చేసి పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే ఏమి చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన ప్రతి ఎకరాకూ రూ.40వేలు పరిహారం చెల్లించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు బాలగోని భిక్షం, నీలం రవి, కట్టెల నర్సయ్య, పల్సం వెంకన్న, కన్నెబోయిన రాజేశ్వర్, నీల ముత్తయ్య, నీల స్వామి, పంగ మహేశ్, బోళ్ల మనోజ్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ కమిషనర్ అంజన్‌కుమార్‌రెడ్డి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అంజన్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 7 : ఎల్ఆర్ఎస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అంజన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్లాట్ యజమానులకు ఎల్ఆర్ఎస్‌పై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ అవకాశం మార్చి 31వరకు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఎస్ రాధాకృష్ణారెడ్డి, శ్రీమిత్ర టౌన్‌షిప్ ప్రతినిధి సందీప్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, రాజు, కొండల్‌రెడ్డి, రియల్‌ఎస్టేట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఎల్ ఆర్ఎస్ లేని ప్లాట్లకు ఇంటి అనుమతులు ఇవ్వం'

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి

చౌటుప్పల్, మార్చి 7 : ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లకు ఇంటి అనుమతులు ఇవ్వబోమని మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఎల్ఆర్ఎస్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ లేకుంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయరన్నారు. 2020లోపు లేఅవుట్లలో 10శాతం రిజిస్ట్రేషన్ అయి మిగతావి కానివారు ఈ నెల 31వరకు 25శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్లాట్ల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ లేని ప్లాట్లకు బ్యాంక్ రుణాలు కూడా ఇవ్వరని చెప్పారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక అధికారి కె.శివ, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల క్యాంపు

సిటీ బ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఆలింకో, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలు అందించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10న అంబర్‌పేటలోని గాంధీ బొమ్మ వద్ద మున్సిపల్ మైదానం, 11న సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన ఎదురుగా ఉన్న ఎవర్ గ్రీన్ కమ్యూనిటీ హాల్,12న ఖైరతాబాద్‌లోని ప్రేమ్‌నగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్, జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్,13న సీతాఫల్‌మండిలోని నామాలగుండు వద్దగల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉపరకరణాలు అందజేస్తారని అన్నారు. క్యాంపునకు హాజరయ్యే వారు దివ్యాంగుల ధ్రువ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా రేషన్ కార్డు లేదా ప్రజా ప్రతినిధుల ద్వారా పొందిన ధ్రువపత్రం, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు, యూడీఐడీ కార్డు లేనివారు నమోదు చేసిన నంబర్‌ను తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా రాత్రివేళ షాపింగ్‌లతో కళ కళ లాడుతున్న చార్మినార్ వీధులు

ఇంటర్మీడియట్ పరీక్షా సెంటర్ తనిఖీ చేసిన కలెక్టర్

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, మార్చి 7 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం తనిఖీ చేశారు. పరీక్షకు ఎంత మంది హాజరయ్యారు.. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, మెడికల్ సిబ్బంది ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో మందులను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించి జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

మాజీ ఎమ్మెల్సీ కృష్ణారెడ్డికి పరామర్శ

మాజీ ఎమ్మెల్సీ కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 7 : మాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డిని జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

న్యాయం చేయాలని నిరసన

తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రేణుక, కుటుంబ సభ్యులు

రాజాపేట, మార్చి 7 : తనకు తెలియకుండా తన భర్త మద్యం మత్తులో భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇంజ ఐలయ్య భార్య రేణుక శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం బాగోలేక తాను పుట్టింటికి వెళ్లాలని, ఇదే అదునుగా భావించిన తన భర్త ఐలయ్య రెండెకరాల భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు. రిజిస్ట్రేషన్ రద్దు చేసి తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను వేడుకున్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రామన్నపేట, మార్చి 7 : పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి జానయ్య, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కిళ్ల గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నట్టల నివారణ మందులు అందజేశారు. పశువులకు వచ్చే వ్యాధుల లక్షణాల గురించి అవగహన కల్పించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి శాఖ ఈఓ రాజశేఖర్, జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్, ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు ఇందిర, వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

గాలి ద్వారా సోకే ఎలర్జీలకు చెక్..

హైదరాబాద్ కొనసాగనున్న విస్తృత పరిశోధనలు

అతి పెద్ద పరిశోధన కేంద్రంగా హైదరాబాద్ ఎలర్జిన్ ఫోరెన్సిక్ ల్యాబ్

సెంటూరియన్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం

అలర్జెన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ ప్రారంభానికి సంబంధించిన ఎంఓయూ వివరాలను ప్రకటిస్తున్న వైద్యులు

ఇది 20 ఏళ్ల నాటి కల: డా వ్యాకరణం నాగేశ్వర్

ఈ విప్లవాత్మక ఆలోచనను కార్యరూపం దాల్చేందుకు గత 20 సంవత్సరాలుగా కృషి చేశారు. శాస్త్రీయ సాహిత్యంలో ఈ తరహా పరిశోధనల ప్రాముఖ్యత ఎన్నోసార్లు ప్రస్తావించబడినప్పటికీ, ఇది ఇప్పటివరకు వాస్తవ జీవితంలో అమలుకు నోచుకోలేదు. హైదరాబాద్, ఈ ఎలర్జీ, ఫోరెన్సిక్ పరిశోధన విప్లవానికి కేంద్ర బిందువుగా మారడం, ఆరోగ్య సంరక్షణ, న్యాయవిధానంతో పాటు విద్యా రంగాల్లో ఒక గొప్ప పురోగతిగా చెప్పకోవచ్చు. బహుళ శాస్త్రీయ అనుసంధానం ద్వారా ఎలర్జిన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీస్ భారతదేశం శాస్త్రీయ నిపుణతను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుంది.

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : గాలి ద్వారా మనుషులకు సోకే రకరకాల ఎలర్జీలకు ఇక నుంచి చెక్ పడనుంది. అందుకు సంబంధించి పరిశోధనలు హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి గత 20 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రయత్నాలు ఇప్పుడు ఫలించాయి. ఈ మేరకు హైదరాబాద్ వరల్డ్ ఎలర్జీ ఫౌండేషన్, సెంటూరియన్ యూనివర్సిటీల మధ్య ఒక కీలక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పంద పత్రాలపై శుక్రవారం ఉదయం రెడ్ హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ రెండు విద్యా సంస్థలకు చెందిన ప్రతినిధులు సంతకాలు చేశారు. భారతదేశ ఏరోబయాలజీ పితామహుడు డా శ్రీపాద్ అగాశే శిష్యుడు డా వ్యాకరణం నాగేశ్వర్, వరల్డ్ ఎలర్జీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా దీని రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. దీర్ఘకాలిక శాస్త్రీయ చర్చల అనంతరం, ఈ గొప్ప విజన్‌ను వాస్తవ రూపం దాల్చాలని నిర్ణయం తీసుకున్నారు.

తొలి ఎలర్జిన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీస్..

ఒక వినూత్న వైద్య, ఫోరెన్సిక్ పరిశోధన కేంద్రానికి సాక్ష్యంగా హైదరాబాద్ ఎలర్జిన్ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీస్ నిలిచింది. డా వ్యాకరణం నాగేశ్వర్ నేతృత్వంలో, ఎలర్జీ సూపర్ స్పెషలిస్టులు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలు, వృక్షశాస్త్ర నిపుణుల సమష్టిగా ఈ పరిశోధనలో భాగస్వామ్య వుతున్నారు. అయితే ఇప్పుడు తొలిసారిగా, ఎలర్జీ, ఫోరెన్సిక్ సైన్స్, వృక్ష శాస్త్ర నిపుణులు కలసి గాలి ద్వారా వ్యాపించే ఎలర్జీలను వాటి న్యాయ వైద్య విభాగంలో ప్రాముఖ్యతపై సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు.

పరిశోధన లక్ష్యాలు..

వివిధ ప్రాంతాల్లో గాలి ద్వారా వ్యాపించే పుప్పొడి కణాలు, శిలీంద్ర స్పోరులు, అచ్చులు గల పరిసరాలను విశ్లేషించడం. అంతరంగిక (ఇండోర్), బహిరంగ (అవుట్ డోర్) పరిసరాలు, నేరస్థలాలు, వాహన భాగాలు, దుస్తులు, వ్యక్తిగత వస్తువులు మొదలైన వాటి నుండి నమూనాలను సేకరించడం.

అధునాతన సూక్ష్మదర్శిని పరికరాల ద్వారా ఎలర్జీన్ల రకం, జాతి, సాంద్రత అంచనా వేయడం.

ఎలర్జీ నిర్ధారణ , చికిత్సలో విప్లవాత్మక మార్పు ఈ పరిశోధన ఎలర్జీ రోగుల జీవితాలను పూర్తిగా మార్చివేస్తుంది. ప్రజలు తమ చుట్టూ ఉండే పుప్పొడి, అచ్చులతో పాటు శిలీంద్రాల గురించి ఖచ్చితమైన సమాచారం తెలుసుకో గలుగుతారు. ఈ డేటా ఆధారంగా, అత్యాధునికమైన చికిత్సగా పేరుగాంచిన ఎలర్జిన్–స్పెసిఫిక్ ఇమ్యూనోథెరపీ (ఏఎస్ఐటీ)ద్వారా ఎలర్జీ నివారణ సాధ్యమవుతుంది.దీని ద్వారా ఎలర్జీ బాధితుల జీవన నాణ్యత పెరుగడమే కాకుండా, మెరుగైన వైద్య పరిశోధనకు మార్గం సుగమం అవుతుంది.

ఫోరెన్సిక్ పరిశోధనలో కీలక పాత్ర

ఈ పరిశోధన.. నేర పరిశోధనలో కీలక పాత్ర పోషించనుంది. నేర స్థలాల్లో పుప్పొడి, శిలీంద్రాలు, అచ్చుల ఆనవాళ్లు విశ్లేషించడం ద్వారా నేరస్థుల కదలికలు, ప్రదేశాలు, కాలన్ని గుర్తించవచ్చు. ఈ శాస్త్రీయ సాక్ష్యాలు, న్యాయ అమలు సంస్థలకు నేరాలను ఛేదించడంలో ఆయుధంగా ఉపయోగపడతాయి.

మహిళా ఉద్యోగులకు సన్మానం

రాజాపేట, మార్చి 7 : ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి శాంతినిర్మల, ఎంపీడీఓ నాగవేణి, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ తయారు చేసుకోవాలన్నారు. అనంతరం మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎంపీఓ ఆవుల కిషన్ మహిళా ఉద్యోగులను సన్మానించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రామన్నపేట : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌తోపాటు మహిళా అధ్యాపకులను సన్మానించి మెమొంటోలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు జహీదా బేగం, కిషన్, జె.చిన్నబాబు, రవీందర్‌రావు, కృష్ణ కౌండిన్య, లక్ష్మి, నీలిమ, బ్రహ్మం, శ్రీను, నరేశ్, యాదగిరి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

బొమ్మలరామారం : మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని మండల ప్రత్యేకాధికారి జ్యోతికుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదుగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, కార్యాలయ పర్యవేక్షకులు జ్ఞానప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు

భువనగిరి అర్బన్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని విద్యుత్ కార్యాలయ మహిళలు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. ఏడీఈ సంధ్య, ట్రాన్స్‌కో ఏఈ సుగుణ పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : కృష్ణవేణి స్కూల్లో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

కృష్ణవేణి పాఠశాలలో..

పట్టణంలోని కృష్ణవేణి స్కూల్లో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘు అఖిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి'

దరఖాస్తు చేస్తున్న ప్లాట్ల యజమానులు

భువనగిరి అర్బన్, మార్చి 7 : లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో భాగంగా చెల్లించే ఫీజులో ప్రభుత్వం అవకాశమిచ్చిన 25శాతం తగ్గింపును ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామలింగం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎల్ఆర్ఎస్ మేళాలో దరఖాస్తులను స్వీకరించారు. ఎల్ఆర్ఎస్‌లో 25శాతం తగ్గింపుపై ఎలాంటి సందేహాలున్నా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సంప్రదించాలన్నారు.

'రాములునాయక్‌కు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి'

సమావేశంలో మాట్లాడుతున్న బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనూనాయక్

బొమ్మలరామారం, మార్చి 7 : తెలంగాణ ఉద్యమకారుడు రాములునాయక్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ శ్రీనూనాయక్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన బంజారాల అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ సీటును బంజారాలకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం బంజారాలకు ఎమ్మెల్సీ పదవి కేటాయించి అధికారంలో భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు బోయిన్‌పల్లి రమేశ్ నాయక్, మండలాధ్యక్షుడు బిక్కునాయక్, నాయకులు రవీందర్‌నాయక్, రాజ్‌కుమార్, నర్సింహనాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సీఐటీయూ

ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాండు

బొమ్మలరామారం, మార్చి 7 : పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు బట్టలు. చెప్పులు, నూనె అందించాలన్నారు. పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించకుంటే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ర్యాకల శ్రీశైలం, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మండలాధ్యక్షుడు శ్రీపతి బాలరాజు, కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

అడ్డగూడూరు, మార్చి 7 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎంపీడీఓ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులు మల్లయ్య, మల్లేశ్, అంజయ్య, యాదగిరి, సోమయ్య, స్వామి పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి'

వలిగొండ, మార్చి 7 : తెలంగాణ మిలియన్ మార్చ్ డే సందర్భంగా ఈ నెల 10న టీయూజేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ నుంచి అమర వీరుల స్తూపం వరకు నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిష్టఫర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన టీయూ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పిట్టల విజయలక్ష్మి, రమేశ్, రాంచందర్, గట్టు సుధాకర్, కోయగూర బాబు, పుష్పలత, లింగం, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

గుండాల మోడల్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్

గుండాల, మార్చి 7 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రయోగాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం చంద్రకళ, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్ వల్ల విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.